సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 11 । జూలై । 2025



'బాబు' మోసాలను ఎండగడదాం!

చంద్రబాబు మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజల వద్ద ఎండగడదామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. 8లో



15 టన్నుల బియ్యం స్వాధీనం

అక్రమంగా విదేశాలకు తరలించేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని పోలీసులు గురువారం తెల్లవారుజామున స్వాధీనపర్చుకున్నారు. 8లో



రైల్వే స్టేషన్‌లో క్యాప్సూల్ హోటల్

విశాఖ రైల్వేస్టేషన్‌లో సరికొత్త సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా క్యాప్సూల్ హోటల్ సిద్ధమైంది. 8లో

న్యూస్‌రీల్

బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల పరిరక్షణకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం : నర్సీపట్నం మెయిన్ రోడ్‌లో ఉన్న బ్రిటిష్ సైనిక అధికారుల సమాధుల ప్రాంతాన్ని గురువారం సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు పోరాట పటిమకు చిహ్నంగా ఉన్న ఈ ప్రాంత అభివృద్ధికి సంబంధించి మండల న్యాయ సేవాధికార సంస్థకు అందిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారుల నుండి కోర్టు వారు వివరాలు సేకరించారు. తాజాగా సమాచారం కోసం పురావస్తుశాఖకు కోర్టు వారు నోటీసు జారీ చేయడంతో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్గుణరావు గురువారం నర్సీపట్నం విచ్చేశారు. పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, సర్వేయర్‌ల తో సీనియర్ సివిల్ జడ్జి ఆ సమాధుల ప్రాంతాన్ని పరిశీలించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు సమాధుల ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

అడ్డురోడ్డులో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్



అడ్డురోడ్డు సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న హోంమంత్రి

ఎస్.రాయవరం: రోడ్డు ప్రమాదాలు , నేరాలు నివారణకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో 100 సీసీ కెమెరాలు నిర్వహణ కంట్రోల్ రూం గురువారం ప్రారంభించారు. పాయకరావుపేట తాండవ జంక్షన్ నుంచి ధర్మవరం అగ్రహారం వరకు ప్రధాన జంక్షన్‌లలో జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటికి అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మహిళల భద్రత కోసం అవసరమయ్యే 10 ఈవీ ద్విచక్ర వాహనాలను మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ జిల్లా అంతా నేరాలు అదుపునకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హైమావతి

కొంకోట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యధిక శాతం సంస్థాగత ప్రసవాలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.హైమావతి ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రం పని తీరును, రికార్డులు, నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు శత శాతం సాధించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారి ఎస్.సుమ, డిప్యూటీ ఆరోగ్య విస్తరణాధికారి ఎం.ఎస్.వి. ప్రసాద్, సీసీ లక్ష్మీనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీకాకుళం వరకే నేడు మెమూ రైలు

విశాఖ సిటీ: విశాఖ-పలాస మెమూ రైలు(67289) శుక్రవారం శ్రీకాకుళం వరకు మాత్రమే నడుస్తుందని వాల్తేరు డివిజన్ అధికారులు ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో మెమూ(67290) పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం నుంచి బయలుదేరి విశాఖకు చేరుకుంటుందని తెలిపారు.

కోరాపుట్ వరకు కిరండూల్ రైళ్లు

- ఈ నెల 11 నుంచి 13 వరకు విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్(18515) కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో (18516) ఈ రైలు కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖకు చేరుకుంటుందన్నారు. విశాఖ-కిరండూల్ పాసింజర్(58501) కోరాపుట్ వరకు వెళుతుందని, అటు నుంచి వచ్చే రైలు కూడా కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖకు వస్తుందని వివరించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



నర్సీపట్నం : పాకలపాడు గురుదేవులను దర్శించుకుంటున్న భక్తులు

ధ్యానమూలం గురుమూర్తిః పూజమూలం గురుపదం
మంత్రమూలం గురుర్వాక్యం మోక్షమూలం గురుకృపా..

జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జిల్లాలోని షిర్డీ సాయి ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. బలిఘట్టం పాకలపాడు గురువు గారు ఆశ్రమంలో గురుపౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. పౌర్ణమి పూజలు ఆచరించడం ద్వారా జాతక దోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

అలాగే కొత్తపెంట దేవానంద స్వామీజీ ఆశ్రమంలో ఘనంగా గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దేవానంద స్వామీజీని దర్శించుకున్నారు.



దేవరాపల్లి : గురుపౌర్ణమి సందర్భంగా కొత్తపెంటలో దేవానంద సరస్వతీ స్వామిజీ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పేరెంట్స్ మీటింగ్

మొక్కుబడిగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దితే..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చూపడంతో మళ్లీ సర్కారు విద్య గాడి తప్పింది. దీనికి దృష్టాంతాలుగా ప్రభుత్వం ఎంతో ప్రచారం చేసి నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల్లో పలు పాఠశాలల్లోని సమస్యలను తల్లిదండ్రులు ప్రస్తావించారు.. నక్కపల్లి ఉద్దండపురంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయగా, అది ఇప్పుడు పనిచేయడం లేదంటూ ఆ గ్రామ ఎంపీటీసీ బచ్చల రాజు పేరెంట్ మీటింగ్‌లో ప్రస్తావించారు.. అనకాపల్లి టౌన్‌లోని గాంధీనగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోలేదని పేరెంట్స్ మీటింగ్‌కు హాజరైన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత లేకుండా రేషన్ బియ్యం వండి విద్యార్థులకు పెడుతున్నారని, ఈ విషయం పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు రావడం వల్ల తెలిసిందని మండిపడ్డారు...

సాక్షి, అనకాపల్లి : జిల్లాలో 1955 పాఠశాలలు, 134 జూనియర్ కళాశాలల్లో గురువారం మెగా పీటీఎం సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన ఈ మెగా సమావేశాలు మొక్కుబడిగా జరిగాయి. పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చ జరుగుతుందన్నారు. ప్రచారార్భాటం తప్ప ఆచరణ కొరవడింది. నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హోంమంత్రి అనిత పాల్గొన్నారు. పరవాడ మండలం లంకెలపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర పాల్గొన్నారు. మునగపాక మండలం పాతిపల్లి గ్రామం ఏపీ మోడల్ స్కూల్లో జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడు, జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి ఆర్.గోవిందరావు పాల్గొన్నారు.



ఉద్దండపురంలో ఆర్‌వో ప్లాంట్లు పనిచేయడం లేదని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ బచ్చలరాజు

బడిలో ఆర్వో ప్లాంటు మూలకు చేరిందేం?

నక్కపల్లి : గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ప్లాంట్లు మూలకు చేరాయని ఉద్దండపురం ఎంపీటీసీ బచ్చలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో జెడ్పీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి ఈ ఆర్‌వో ప్లాంటు మూలకు చేరడంతో విద్యార్థులకు సురక్షిత మైన తాగునీరు అందడం లేదన్నారు. గత ప్రభుత్వంలో వీటిని ఏర్పాటు చేయడంతో పాటు, నిర్వహణకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవి పనిచేయడం లేదన్నారు. తల్లిదండ్రులు ఇటువంటి సమస్యలు తెలియజేయడం కోసమే ఈ సమావేశాలను **ఉపయోగించుకోవాలన్నారు. త్వరలోనే ఈ** ప్లాంట్లను వాడుకలోకి తీసుకు వచ్చి విద్యార్థులకు తాగునీరు అందించాలన్నారు. దేవవరం, చినదొడ్డిగల్లు, గొడిచర్ల, వేంపాడు, బోదిగల్లం, తీనార్ల, నక్కపల్లి, ఉపమాక, నక్కపల్లి గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు జరిగాయి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంఈవో కుంచం నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి చైర్మన్‌లు పాల్గొన్నారు.

రోజూ పిల్లలకు ఇదే భోజనం పెడుతున్నారా...!

అనకాపల్లి టౌన్: గాంధీనగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే భోజనం బాగోలేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్న భోజన సమయంలో గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ రేషన్ బియ్యం వండి విద్యార్థులకు పెడుతున్నారని విమర్శించారు. ఈ విషయం పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు రావడం వల్ల తెలిసిందన్నారు. ప్రతి రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే కొందరు మండల విద్యాశాఖాధికారికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన విద్యాశాఖాధికారి కోటేశ్వరావు స్వయంగా స్కూల్‌కి వెళ్లి భోజన పథకం తీరును పరిశీలించారు. భోజనం రుచి చూసి నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేశారు. **నిర్వాహకులను పిలిచి పనితీరు మార్చుకోకపోతే చర్యలు** తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గతంలో పలుమార్లు హెచ్చరించామని, **తల్లిదండ్రులతో కూడిన కమిటీ తీర్మానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు**.



గాంధీనగరం పాఠశాలలో ఎంఈవో ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఇదేం మెహర్బానీ...!



పేరెంట్స్ మీటింగ్‌లో తన కుమారుడు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న హోంమంత్రి అనిత

మండల కేంద్రం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ మీటింగ్ లో హోంమంత్రి అనిత కుమారుడు నిఖిల్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం చర్చనీయాంశం అయింది. కళాశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌కు హోంమంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. ఇదే రోజు మంత్రి కొడుకు పుట్టినరోజు కావడంతో స్థానిక కూటమి నాయకులు మంత్రి మెప్పు కోసం అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇదే సమావేశం పక్కన ప్రత్యేకంగా పుట్టినరోజు వేడుకలు ఏర్పాటు చేశారు. మంత్రి అనిత తన కొడుకుతో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమం చూసి పేరెంట్స్ ముక్కున వేలేసుకున్నారు. పేరెంట్స్ మీటింగ్‌కు అని పిలిచి మంత్రి కుమారుడి పుట్టినరోజు సంబరాలు నిర్వహించుకుంటారా..? అంటూ అసహనం వ్యక్తం చేశారు.

ఫ్యూజ్ పోయినా డబ్బులివ్వాల్సిందే...!

- రాత్రిపూట కరెంటు పోతే జాగరణ చేయాల్సిందే..
- నిత్యం కరెంటు కోత...బిల్లుల పేరిట వాత
- విద్యుత్‌శాఖ తీరుపై వినియోగదారుల ధ్వజం




సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యూజ్ పోతే వేసినందుకు ఎంత చెల్లించాలని విద్యుత్ వినియోగదారులు అధికారులను ప్రశ్నించారు. కైలాసపట్నం విద్యుత్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సదస్సును గురువారం నిర్వహించారు. విద్యుత్ ట్రాన్స్‌కో ఎస్ఈ జి.ప్రసాద్ వినియోగదారుల సమస్యలపై ఆరా తీయగా వినియోగదారులు ఆగ్రహంతో అధికారులపై ప్రశ్నల దాడి చేశారు. జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది తీరు అధ్వానంగా ఉందన్నారు. దీనిపై జెడ్పీ సమావేశంలో కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్‌ను ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. రోజులో కనీసం ఐదారుసార్లు అనధికారిక విద్యుత్ కోత ఉంటోందని, రైతులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి ఐదు నిమిషాలకు విద్యుత్ సరఫరా ఫ్లక్చ్యుయేషన్ అవుతోందని, ఇంత అధ్వానమైన విద్యుత్ సరఫరాను గత ప్రభుత్వంలో ఎప్పుడూ చూడలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ అధికారులు అంతులేని నిర్లక్ష్యంతో పనిచేస్తున్నారని, లోపం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. రైతు తుమ్మలపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ ఫ్యూజ్ పోయినా డబ్బులు ఇవ్వందే మీ సిబ్బంది పనిచేయరని ఆరోపించారు. పొలాల్లో విద్యుత్ తీగెలు కిందికి వేలాడి రైతుల పాలిట ప్రాణసంకటంగా ఉన్నాయని, కనీస నిర్వహణ కూడా చేయడం లేదన్నారు. సమస్య ఉందని ఫోన్ చేసినా ఎవరూ ఫోన్ ఎత్తరని, రాత్రి పూట కరెంట్ పోతే రాత్రంతా జాగరణ చేయాల్సిందే అన్నారు. ఈ సదస్సులో వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వామీ.. నీ సన్నిధి చేరి..



రాజగోపురం వద్ద బాల శ్రీరాముడి నమూనా



తొలి పావంచాకి చేరుకుంటున్న.. తొలిపావంచా నుంచి తమ ఇళ్లకు తిరుగు పయనం అవుతున్న భక్తులు



పావను ఎత్తుకుని దర్శనానికి వస్తున్న భక్తుడు



భక్తురాలి కాలికి మర్దన చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



గిరి ప్రదక్షిణ చేసి మెట్లమార్గంలో సింహగిరికి వస్తున్న భక్తులు

- అచంచల భక్తితో గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు
- పౌర్ణమి వేళ విశేషంగా ఆలయ ప్రదక్షిణలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జన సందోహం
- నృసింహుని స్మరణతో మార్మోగిన గిరి మార్గం



తొలిపావంచా వద్ద రోడ్డుపైనే కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



వంతెనపై నుంచి వెళ్తున్న ఆలయ ప్రదక్షిణ భక్తులు, కింద నుంచి దర్శనానికి వెళ్తున్న భక్తులు

సింహాచలం: ఆషాఢ శుద్ధ చతుర్దశి పురస్కరించుకుని జరిగిన సింహగిరి ప్రదక్షిణ మహోత్సవం గురువారంతో దిగ్విజయంగా ముగిసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ బుధవారం చేపట్టిన 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ అశేష జన సందోహంతో కొనసాగింది. సింహాచలంలోని తొలి పావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామి సన్నిధిలో కొబ్బరికాయ కొట్టి తమ ప్రదక్షిణను ముగించారు. పలువురు భక్తులు సింహగిరికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

సింహగిరిపై జన జాతర

ఒక పక్క 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు.. మరో పక్క ఆలయ ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతో గురువారం సింహగిరి భక్తజనజాతరగా మారింది. దేవస్థానం అంచనాల ప్రకారం.. ఈ సారి గిరి ప్రదక్షిణలో సుమారు 8 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. గురువారం ఒక్క రోజే 68 వేల మంది భక్తులు సింహగిరిపై స్వామిని దర్శించుకోగా, బుధవారం 42 వేల మంది దర్శనం చేసుకున్నారు. అలాగే సుమారు 5 వేల మంది భక్తులు ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుంచే దర్శనాలు

గిరి ప్రదక్షిణ చేసి సింహగిరికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు గురువారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే స్వామి దర్శనాలకు అనుమతించారు. తొలుత ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామని ప్రకటించినప్పటికీ.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించే ఉద్దేశంతో ఉదయం 4.30 గంటల నుంచి రూ.100, రూ.300 టికెట్ల క్యూల్లో కూడా భక్తులను ఉచితంగా పంపించారు. ఆలయ నీలాద్రి గుమ్మం దగ్గర నుంచే లఘు దర్శనం కల్పించి, అంతరాలయ దర్శనాన్ని నిలిపివేశారు.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం ఆలయ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులను ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు.

ముఖ్యాంశాలు

- కొండ దిగువ పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. గిరి ప్రదక్షిణ పూర్తి చేసి తొలిపావంచాకు చేరుకునే భక్తులు, ప్రదక్షిణ పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకునే భక్తులతో రద్దీ నెలకొంది.
- గిరి ప్రదక్షిణ ముగించుకుని కొబ్బరికాయలు కొట్టే భక్తులతో తొలిపావంచా గురువారం మధ్యాహ్నం వరకు కిటకిటలాడింది.
- మెట్ల మార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులను మాత్రమే అనుమతించారు. కొండ దిగువకు మెట్ల మార్గంలో అనుమతించలేదు.
- సింహగిరి నుంచి దిగువకు, దిగువ నుంచి కొండ పైకి దేవస్థానం 50 ఉచిత బస్సులను నడిపింది.
- 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి సింహగిరి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన కింద నుంచి దర్శనానికి, దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి దర్శన అనంతరం బయటకు పంపించారు.
- ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద నాలుగు లైన్లలో ర్యాంపులు ఏర్పాటు చేసి దర్శనాలు కల్పించారు.
- సింహగిరిపై అడవివరం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- భక్తులు కొట్టిన కొబ్బరికాయలతో తొలి పావంచా వద్ద పెద్ద ఎత్తున కుప్ప ఏర్పడింది.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో కదంబం, దద్దోజనం ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.
- సింహగిరిపై బస్టాండ్‌లో తీవ్ర రద్దీ నెలకొంది. కొండ దిగువకు వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ భక్తుల రద్దీతో నిండిపోయాయి. అలాగే కొండ దిగువ పాతగోశాల జంక్షన్ వద్ద తీవ్ర రద్దీ నెలకొంది.
- తొలిపావంచా వద్ద పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం వద్దకు వచ్చిన చాలా మంది భక్తులు తమ బంధువులు కనిపించడం లేదని పోలీసుల సహాయం కోరారు.
- సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.
- గిరి ప్రదక్షిణ చేసిన చాలా మంది భక్తులు అడవివరంలోని తొలిపావంచా వద్ద మెట్లపై, రహదారి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాల్లో, పలు కల్యాణ మండపాల హాళ్లలో నిద్రించి, ఆ తర్వాత తమ గ్రామాలకు తరలివెళ్లారు.



స్వామి దర్శనానికి గురువారం తెల్లవారుజామున క్యూలో వేచి ఉన్న గిరి ప్రదక్షిణ భక్తులు

క్లుప్తంగా

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి అభినందన



సతీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల : మండలంలో కింతలి హైస్కూల్లో చదివిన పాసింబిల్లి సతీష్ ముంబై ఐఐటీలో సీటు సాధించాడు. దీంతో సతీష్‌తో పాటు తల్లి దండ్రులును, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ మైచర్ల భవాణి, ఎంపీటీసీ నాయుడు, ఎంఈవో దేముడమ్మ, పుప్పాల రమేష్, ఉండూరు దేముడు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి నేతల మద్దతుతో ప్రభుత్వ భూమి ఆక్రమణ

- కలెక్టరుకు వైఎస్సార్‌సీపీ నేత ఫిర్యాదుతో కదిలిన అధికారులు



గుమ్మడిగొండలో ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నాతవరం: కూటమి నేతల మద్దతుతో కొందరు ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలో గుమ్మడిగొండ పంచాయతీ సర్వే నంబరు 102/2లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో గత ప్రభుత్వం జగనన్న లేఅవుట్ వేసి ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు నిర్ధారించారు. అందులో పేదలకు ఇళ్ల నిర్మాణం చేయకూడదంటూ అప్పటి కూటమి నేతలు వివాదం సృష్టించి కోర్టును ఆశ్రయించారు. కోర్టు వివాదంతో ఈ భూమిలో అప్పట్లో ఇళ్ల నిర్మాణం చేయకుండా మరో చోట స్థలాలు కేటాయించారు. ప్రస్తుతం ఈ భూమిలో పలువురు మొక్కలు నాటి ఆక్రమణకు పూనుకున్నారు. ఈ విషయంపై ఎంపీటీసీ సభ్యులు సుర్ల పాప, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుర్ల అచ్చియ్య నాయుడు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. నాతవరం తహసీల్దార్ వేణుగోపాల్ రెండు రోజుల క్రితం ఆ భూమిని పరిశీలించారు. భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిని పిలిచి తమ వద్ద ఏమైనా రికార్డులు ఉంటే చూపించాలన్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఈ భూమిలో ఎటువంటి పనులు చేపట్టరాదన్నారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది అందరి సమక్షంలో గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

'బాబు' మోసాలను ఎండగడదాం!



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ నేతల పిలుపు
- తారువలో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం
- పాల్గొన్న అమర్‌నాథ్, బూడి, ధర్మశ్రీ, శోభా హైమావతి
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

దేవరాపల్లి : కూటమి ఏడాది పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా చంద్రబాబు సహా ఆ పార్టీల నేతలు చేసిన మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజల వద్ద ఎండగడదామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తారువలోని వైఎస్సార్ ఆడిటోరియంలో గురువారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి తదితరులు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పేరిట చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెచ్చే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ 2.0లో పార్టీ కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత కల్పిస్తామని వైఎస్ జగన్ భరోసా కల్పించారన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తామంతా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసగించగా.. వైఎస్ జగన్ మాత్రం మేనిఫెస్టోలోని నవరత్న పథకాలతో పాటు చెప్పనవి ఎన్నో పథకాలను గత ప్రభుత్వ హయాంలో అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి పార్టీలను గెలిపించి తప్పు చేశామని ప్రజలు పశ్చాతాపం పడుతున్నారని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగన్ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్ రూపకల్పన చేసిన అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చి తన కుమారుడు రూపకల్పన చేశారని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబులా నిస్సుగ్గుగా అబద్ధాలు చెప్పే నాయకుడు ఈ భూప్రపంచంలో ఎక్కడా ఉండరని ఎద్దేవా చేశారు. ముఖ పరిచయం లేని సీఎం రమేష్‌ను ఎంపీగా గెలిపిస్తే, దర్జాగా ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు.

జరిగిన నష్టంపై అవగాహన కల్పించాలి..



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నయవంచనను, వైఫల్యాలను గ్రామ స్థాయిలో కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ఏడాది పాలనలో ప్రతి ఇంటికి జరిగిన నష్టంపై కూటమి నేతలను నిలదీసేలా ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు గ్రహించారని, జగన్ పర్యటనకు ఉప్పెనలా తరలివస్తున్న జనమే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్ జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు.

బాబు మోసగాడు... పవన్ వేషగాడు



అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా చంద్రబాబు మోసగాడిలా, పవన్ వేషగాడిలా మిగిలిపోయారని విమర్శించారు. చంద్రబాబు లాంటి చీటర్ దేశంలోనే లేరని విమర్శించారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందించి జగన్ మగాడిలా, మొనగాడిలా నిలిచారన్నారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో సైతం జగన్ నామ స్మరణం చేస్తున్నారన్నారు. కూటమి నేతల మోసాలను ఎండగట్టేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు.

ఏడాదిలోనే కూటమిపై తీవ్ర వ్యతిరేకత



పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలతో కూడిన బాండ్ ఇచ్చి ప్రజలకు పంగనామాలు పెట్టారన్నారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్ ప్రయాణం పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ, జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేష్, సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీను, మాడుగుల, కె.కోటపాడు ఎంపీపీలు తాళ్లపురెడ్డి రాజారామ్, దేవరాపల్లి, మాడుగుల జెడ్పీటీసీలు కర్రి సత్యం, కిముదు రమణమ్మ, పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబూరావు, గొల్లివిల్లి రాజుబాబు, వేమవరపు రామధర్మజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలంనాయుడు, ఆర్‌వీకే నాయుడు తదితర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు



నక్కపల్లి పాఠశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

- హోం మంత్రి అనిత
- నక్కపల్లి జెడ్పీ పాఠశాలలో పీటీఎం

నక్కపల్లి: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది సదుపాయాలను కల్పిస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం ఆమె నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేరెంట్స్, టీచర్స్‌తో సమావేశాలు నిర్వహిస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థుల ప్రగతిని తెలియజేయడంతోపాటు వారి సమస్యలను తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని పరిష్కరించేందకు ఈ సమావేశాలు దోహదపడతాయన్నారు. సన్నబియ్యంతోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నట్టు చెప్పారు. గంజాయి వ్యాపారాలు చేస్తున్న వారికి సంక్షేమ పథకాలు రద్దు చేస్తున్నామన్నారు.

విద్యార్థుల విషయంలో బాధ్యతగా ఉండాలి

గొలుగొండ: విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చాలా బాధ్యతగా ఉండాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇంటి వద్ద సెల్‌ఫోన్లు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును పూర్తిగా ఉపాధ్యాయులపై పెట్టకుండా తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, సర్పంచ్ లోచల సుజాత, నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ తారకవేణుగోపాల్, అడిగర్ల అప్పలనాయుడు, హెచ్‌ఎం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు సత్కారం



9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రత్నకుమారను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

చోడవరం : స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.రత్నకుమార్ బదిలీ కావడంతో ఆయనకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రత్నకుమార్ విశాఖపట్నం 12వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా కాకినాడను నుంచి హరినారాయణను బదిలీ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్‌కు వీడ్కోలు సభను నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి వెంకటరావు అధ్యక్షతన ఈ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి నరేష్, చోడవరం సబ్ జడ్జి గౌరీశంకర్ , ఫస్ట్ క్లాస్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ సూర్యకళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నకుమారను బార్ అసోసియేషన్ శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. చోడవరం బార్ అసోసియేషన్ సహకారం మరువలేనిదని న్యాయమూర్తి రత్నకుమార్ అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చీపురపల్లి సూర్యనారాయణ, ప్రతినిధులు ఉగ్గిన వెంకట్రావు, అల్లు గిరిధర్, కాండ్రేగుల డేవిడ్, కె.భాస్కర్‌దాస్, గూనూరు లక్ష్మీనారాయణ, ఎస్.సుబ్బలక్ష్మి, జి.వి.పి రాజు, గోవిందు, పప్పల రమణమూర్తి, వరలక్ష్మి, సత్యవతి, అప్పర్ల పాల్గొన్నారు.

చాతుర్మాస్య మహావ్రతం ప్రారంభం

- కొత్తపెంటలో సద్గురు దేవానంద స్వామిజీ ఆశ్రమంలో సందడి
- పలు జిల్లాల నుంచి హాజరైన సాధువులు
- దేవానంద స్వామీజి సమాధిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి



చాతుర్మాస్య మహావ్రతం క్రతువుకు హాజరైన సాధు సత్ పురుషులు

దేవరాపల్లి : కొత్తపెంటలోని సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ ఆశ్రమంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని చాతుర్మాస్య మహావ్రతం పూజలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ చాతుర్మాస్య మహావ్రత ఆధ్యాత్మిక కార్యక్రమం నవంబర్ 5 (కార్తీక పౌర్ణమి) వరకు సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే తొలిరోజు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవానంద స్వామీజీని దర్శించుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సాధు సత్పురుషులు, పీఠాధిపతులు హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. దేవానంద స్వామీజీని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకొన్నారు. సద్గురు దేవానంద స్వామీజీ వారి 25వ పుణ్యతిథి రజతోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ వ్రత కాలంలో ప్రతి రోజు పూజా కార్యక్రమాలు, భగవద్గీత పారాయణం, పఠనలు, ప్రవచనాలు, ధ్యాన ధారణలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు దివ్య జీవన్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో క్యాప్సూల్ హోటల్

- పీపీపీ విధానంలో అభివృద్ధి.. అందుబాటులోకి 88 క్యాప్సూల్ బెడ్లు
- 3 గంటల వరకు రూ.200, రోజుకు రూ.400 వసూలు
- రైలు ప్యాసింజర్లతో పాటు బయటి వారు వినియోగించుకునే సౌకర్యం
- డిమాండ్‌ను బట్టి మరిన్ని స్టేషన్లలో ఏర్పాటుకు ఆలోచన
- వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బొహ్రా



విశాఖ సిటీ : విశాఖ రైల్వేస్టేషన్‌లో సరికొత్త సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా క్యాప్సూల్ హోటల్ సిద్ధమైంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్(పీపీపీ) విధానంలో ప్లాట్‌ఫాం నెంబర్–1, గేట్ నెంబర్–3 వద్ద మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోనే తొలిసారిగా ఈ తరహా క్యాప్సూల్ హోటల్‌ను విశాఖలోనే అందుబాటులోకి తీసుకొచ్చామని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా తెలిపారు. గురువారం డీఆర్‌ఎం చాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్‌లో వసతి సౌకర్యాలకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న రిటైరింగ్ రూమ్స్ సరిపోక ప్రయాణికులు బయట హోటల్స్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైలు ప్రయాణికులకు, పర్యాటకులకు అందుబాటు ధరలో సౌకర్యవంతమైన వసతి కల్పించాలన్న ఉద్దేశంతో సరికొత్తగా క్యాప్సూల్ హోటల్‌ను ఏర్పాటు చేశారు. ఈ తరహా హోటల్స్ ప్రస్తుతం ముంబై, హైదరాబాద్ వంటి రైల్వేస్టేషన్లలో మాత్రమే ఉన్నాయి.

పీపీపీ విధానంలో అభివృద్ధి

విశాఖ రైల్వే స్టేషన్‌లో కూడా ఆధునిక హంగులు, అందుబాటు ధరలతో క్యాప్సూల్ హోటల్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఈ–యాక్షన్ నిర్వహించారు. ఇందులో శ్రీ మహాలక్ష్మి ఏజెన్సీ అనే సంస్థ ఐదేళ్ల కాలానికి ప్రాజెక్టును దక్కించుకుంది. రైల్వేస్టేషన్ మొదటి అంతస్తులో అధికారులు స్థలాన్ని కేటాయించారు. సదరు కాంట్రాక్టు సంస్థ ఇక్కడ క్యాప్సూల్ హోటల్‌ను అభివృద్ధి చేసింది. ఇందులో 73 సింగిల్ బెడ్లు, 15 డబుల్ బెడ్లు మొత్తంగా 88 బెడ్లను ఏర్పాటు చేసింది. మహిళల కోసం 18 బెడ్లు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది. రైల్వే ప్రయాణికులతో పాటు పర్యాటకులు, బయట వ్యక్తులకు కూడా ఈ హోటల్‌లో వసతి పొందే సౌలభ్యాన్ని కల్పించారు.

3 గంటలలోపు రూ.200

ఈ కొత్త క్యాప్సూల్ హోటల్‌లో అన్ని రకాల సౌకర్యాలతో పాటు అనేక సదుపాయాలు కల్పించారు. అతిథులకు ఉచిత వైఫై, 24 గంటలు వేడి నీళ్ల సౌకర్యం, పర్యాటకుల కోసం ట్రావెల్ డెస్క్‌తో పాటు ఇన్‌హౌస్ స్నాక్ బార్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సింగిల్ బెడ్‌కు 3 గంటలలోపు రూ.200, 3 నుంచి 24 గంటల వరకు రూ.400 వసూలు చేయనున్నారు. అలాగే డబుల్ బెడ్‌కు మూడు గంటలలోపు రూ.300, 3 నుంచి 24 గంటలలోపు అయితే రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా ఈ బెడ్స్‌ను బుక్ చేసుకునే సదుపాయం లేదని డీఆర్‌ఎం తెలిపారు. డిమాండ్‌ను బట్టి ఆ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

రేషన్ డిపోలు, పాఠశాలలు ఆకస్మిక తనిఖీ

- తూకం, సీల్ సరిగా లేని రేషన్ డిపోపై కేసు నమోదుకు ఆహార కమిషన్ సభ్యుడు ఆదేశాలు



గుండాల జంక్షన్‌లో రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు విస్తృతంగా గురువారం పర్యటించారు. పలు రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు తనిఖీలు నిర్వహించారు. గాంధీనగరంలో రేషన్ డిపోని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గుండాల జంక్షన్‌లోని రేషన్ డిపోలో తూనిక యంత్రం లైసెన్స్, సీల్ సక్రమంగా లేని కారణంగా కేసు నమోదు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గవరపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందించే పౌష్టికాహారం విషయంలో ఎటువంటి తప్పిదాలు చేయరాదని సూచించారు. గవరపాలెం పార్కుసెంటర్ పక్కన్న ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం రికార్డును తనిఖీ చేసి, లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. వేల్పులవీధిలో ఉన్న టౌన్ గరల్స్ హైస్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి, సాంబారు పల్చగా ఉండడం చూసి నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, లీగల్ మెట్రాలజీ, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

15 టన్నుల బియ్యం స్వాధీనం

- వ్యాన్‌లో కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా పట్టివేత
- పీడీఎస్ బియ్యంగా అంగీకరించిన యజమాని



తెరువుపల్లి వెంకటేశ్వరా రైస్ మిల్లులో వ్యాన్‌తో తరలించడానికి సిద్ధం చేసిన పీడీఎస్ బియ్యం

యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీ నుంచి అక్రమంగా విదేశాలకు తరలించేందుకు కాకినాడ పోర్టుకు తీసుకెళ్లడానికి ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని లోడు చేసిన వాహనాన్ని యలమంచిలి రూరల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున స్వాధీనపర్చుకున్నారు. ఇందుకు బాధ్యులుగా తెరువుపల్లి న్యూ వెంకటేశ్వర రైసు మిల్లు యజమాని నక్కపల్లి మండలం చందనాడ గ్రామానికి చెందిన బాలం కొండబాబు, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బొరిగుమ మండలం జయంతగిరి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ సదారక్ హరిజన్‌లను అదుపులోకి తీసుకున్నారు. యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర విలేకరులకు తెలిపిన వివరాలివి. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి న్యూ వెంకటేశ్వర రైసు మిల్లులో బుధవారం రాత్రి ఓడీ 10ఏఏ 5409 రిజిస్ట్రేషన్ నంబరు గల వ్యాన్‌లో చౌక దుకాణాల వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా కావాల్సిన సుమారు 15 టన్నుల బియ్యాన్ని 300 బస్తాల రూపంలో లోడ్ చేశారు. ఈ సమాచారాన్ని అందుకున్న కొందరు మీడియా ప్రతినిధులు, యలమంచిలి రూరల్ పోలీసులు రైసు మిల్లు వద్దకు చేరుకుని పరిశీలించగా అప్పటికే రేషన్ బియ్యాన్ని వ్యానులో లోడ్ చేసి తరలించడానికి సిద్ధం చేసిన విషయాన్ని గుర్తించారు. వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యం పీడీఎస్ బియ్యంగా తమకు అనుమానం ఉందని,పోలీసు సిబ్బంది యజమానిని అడగ్గా మీకు చెప్పాల్సిన అవసరం లేదంటూ చెప్పి వ్యాన్ డ్రైవర్‌ను అక్కడ్నుంచి పరారైపోమని చెప్పగా అతను వ్యాన్ తాళాలు పట్టుకుని పరారయ్యాడు. వాహనాన్ని స్వాధీనపర్చుకోవడానికి ప్రయత్నించిన పోలీసులకు రైసు మిల్లు యజమాని సహాయ నిరాకరణ చేశాడు. దీంతో పోలీసులు సుమారుగా నాలుగు గంటలు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. రైసు మిల్లు యజమాని,మరొకరు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొద్ది సేపటికి యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర సైతం రైసు మిల్లు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో బియ్యం లోడుతో ఉన్న వ్యాన్‌ను యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రాథమిక విచారణ అనంతరం రైసు మిల్లు యజమాని వ్యాన్‌లో ఉన్నది చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యంగా అంగీకరించాడు. దీనిపై కేసు నమోదు చేసిన అనంతరం ఈ సమాచారాన్ని పోలీసులు స్థానిక తహసీల్దార్‌కు అధికారికంగా అందజేశారు. ఈ మేరకు యలమంచిలి మండలం పౌరసరఫరాల డీటీ వ్యాన్‌లో ఉన్న బియ్యం బస్తాల్లో ర్యాండంగా మూడు కేజీల శాంపిళ్లను సేకరించి, పీడీఎస్ బియ్యమా? కాదా? అని నిర్ధారించడానికి జిల్లా పౌరసరఫరాల అధికారికి పంపించారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యలమంచిలి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు మామూళ్లకు తలొగ్గి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి.

ఆటోను ఢీ కొట్టిన కారు..

- నలుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు, నుజ్జు అయిన ఆటో

మాకవరపాలెం: ఆటోను కారు ఢీకొట్టిన సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. నర్సీపట్నం వైపు నుంచి మాకవరపాలెం వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు మండలంలోని జీ.గంగవరం వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ లాలం రమణబాబుతో సహా మరో ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిలో ఇద్దరిని విశాఖ, మిగిలిన ఇద్దరినీ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో శివాజీ మృతదేహం

మాడుగుల రూరల్: డి.గోటివాడ గ్రామంలో విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన తెలియవచ్చింది. గ్రామానికి చెందిన బొబ్బాది శివాజీ (22) గురువారం ఉదయం తన పొలంలో పామాయిల్ కొమ్మలు నరుకుతుండగా, చెట్టు పక్కన్న వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టడంతో శివాజీ విద్యుత్ షాక్‌కు గురియ్యారు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం తరలిస్తుండగా, మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై ఇంతవరకూ ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

తగరపువలస : ఆనందపురం మండలం శొంఠ్యాం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన నందారపు ఉమా పవన్(19) అనే బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఆనందపురం ఎస్ఐ జి.సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నా ఉన్నాయి. పవన్ చెరకుపల్లి అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లాడు. తిరిగి స్నేహితులతో వచ్చే క్రమంలో గురువారం అడవివరం నుంచి ఆటో ఎక్కారు. ఆటో డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ కుడివైపు ఫుట్‌పాత్ ఎక్కించాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఎడమవైపు కూర్చున్న పవన్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి రాము ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ సంతోష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మా భూములకు రక్షణ కల్పించండి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట గిరిజనుల భైటాయింపు



ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

నర్సీపట్నం : మా భూములను కాపాడాలంటూ మాడుగుల మండలం, గదబూరు గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలు గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట బైటాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. 'ఆర్డీవో గారూ.. మా భూములకు రక్షణ కల్పించండి' అంటూ నినాదాలు చేశారు. గిరిజన కుటుంబాలకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం అటవీహక్కుల చట్టం ప్రకారం పట్టాలు మంజూరు చేసిందన్నారు. 30 ఏళ్లుగా జీడిమామిడి తోటలను సాగు చేసుకుని ఫలసాయం అనుభవిస్తున్నారన్నారు. భూ మాఫియా దారులు జేసీబీలతో జీడి చెట్లను నేలమట్టం చేశారన్నారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఆర్డీవోకు ఇప్పటికే రెండు పర్యాయాలు ఫిర్యాదు చేసినా స్పందనలేదన్నారు. ఎస్ఐకి గిరిజనులు ఫిర్యాదు చేస్తే భూ మాఫియా జోలికి వెళ్లవద్దని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గిరిజనులకు ఈ జీడితోటలు తప్ప వేరే జీవనోపాధి లేదని, ఆర్డీవో స్పందించి భూ మాఫియా నుంచి తమ భూములకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం స్వామి వారికి ప్రత్యేక హోమాన్ని అర్చకులు పులఖండం రాజేష్, ప్రసాద్ నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో బి. మురళీకృష్ణ, అర్చకులు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహ భజన

కశింకోట: స్థానిక గవరపేటలో ఓ ఆశ్రమంలో గురువారం హరి నామస్మరణతో ఏకాహం భజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆషాఢ మాసం వ్యాస పౌర్ణమి పురస్కరించుకొని చేపట్టిన కార్యక్రమం శుక్రవారం ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.

మేలు రకాల పశు గ్రాసాల సాగుపై దృష్టి


పశు గ్రాసం సాగుపై అవగాహన కలిగిస్తున్న పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకురాలు సౌజన్య

కశింకోట: మేలైన రకాల పశు గ్రాసాల సాగు పట్ల రైతులు దృష్టి సారించాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకురాలు బి. సౌజన్య తెలిపారు. పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో మేలు జాతి పశు గ్రాసాల సాగు, పశు పోషణపై పాడి రైతులకు గురువారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పశు గ్రాస రకాలు, వాటి సాగు పద్ధతులు, గ్రాసం నిల్వ ఉంచే పద్ధతులను వివరించారు. అనంతరం ఒక రైతు పది సెంట్ల భూమిలో సూపర్ నేపియర్ రకం నాట్లు నాటారు. ఇది ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నరసింగబిల్లి పశు వైద్యాధికారి ఆల్ఫోన్సా జార్జ్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 17వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.ఆశాజ్యోతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 32 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	-	-
మూడోరకం	3,100	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	: సూపర్‌మన్
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	: ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: వర్జిన్ బాయ్స్
శ్రీ సత్య	: ది 100
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 75 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 20 యూనిట్లు, బీ పాజిటివ్ -14, ఓ పాజిటివ్ -37, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 337 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

స్ట్రీట్ వెండర్

- కూటమి ప్రభుత్వం నుంచి అందని ఆర్థిక సాయం
- ప్రైవేటుగా అప్పులు చేసి వ్యాపారాలు
- దళారుల దోపిడీలో చితికిపోతున్న వైనం
- గుర్తింపు కార్డులు లేక ఇబ్బందులు
- కానరాని వ్యాపార భవన సముదాయం


ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో చిరువ్యాపారులు


మెయిన్ రోడ్డు నెహ్రూ చౌక్ వద్ద రహదారిపై చిరువ్యాపారులు

అనకాపల్లి:

రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలతో వీధి వ్యాపారులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒక వైపు తమ రోజువారీ సంపాదనలో సగం దళారులకు సమర్పించుకోగా, మిగిలిన దాంతో బతకలేక ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వీరికి ప్రత్యేకంగా వ్యాపార భవన సముదాయం నిర్మించి ఇవ్వకపోవడంతో రోడ్లపై చిరు వ్యాపారులు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనికితోడు కూటమి పాలనలో వడ్డీ లేని రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటుగా అప్పులు చేసి వడ్డీలు చెల్లించ లేక ఇబ్బంది పాలవుతున్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడానికి యూసీడీ(పట్టణ సామాజికాభివృద్ధి) విభాగం అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు.

ఈ ప్రాంతాల్లోనే నిత్యం వ్యాపారాలు

అనకాపల్లి పట్టణంలో కశింకోట, మునగపాక, చోడవరం, రావికమతం, మాకవరపాలెం, బుచ్చెయ్యపేట, పరవాడ మండలాల నుంచి చిరు వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగిస్తారు. పట్టణ పరిధిలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి, రింగ్‌రోడ్డు, పెరుగుబజార్, వేల్పులవీధి జంక్షన్, నెహ్రూచౌక్, శారదాబ్రిడ్జి వరకూ, ఆర్టీసీ కాంప్లెక్స్, చోడవరం రహదారిలో నిత్యం చిరువ్యాపారులు వ్యాపారాలు సాగిస్తారు.

ఏరియాను బట్టి డబ్బులు వసూలు

వీధి వ్యాపారాలు చేసుకునేవారికి పట్టణ పరిధిలో ప్రత్యేకంగా వెండింగ్ జోన్ (వ్యాపార స్థలాలు) ఏర్పాటు చేయాలి. గుర్తింపు పొందిన వ్యాపారులను అందులో అవకాశం కల్పించాలి. అందుకు విరుద్ధంగా ప్రస్తుతం పట్టణ ప్రధాన కూడళ్లు, రహదారుల్లో వీధి వ్యాపారులకు ప్రభుత్వ స్థలాలను దళారులు అద్దెకు ఇస్తుండటం గమనార్హం. కుటుంబ పోషణకు దుకాణం లేదా తోపుడుబండి ఏర్పాటు చేసుకుంటే, స్థానిక నాయకుడికి ప్రాంతాన్ని బట్టి రూ.20 వేల నుంచి రూ.30 వేలు చెల్లించుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా నెలవారి రూ. 5 వేలు నుంచి రూ. 15 వేల వరకూ అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరో పక్క చిరు వ్యాపారులకు తోపుడు బడి కొనుక్కునే స్థోమత లేకపోవడంతో వాటిని అద్దెకిచ్చే బ్యాచ్‌లు పట్టణంలో 20 వరకూ ఉన్నాయి. ఒక్కొక్క బండికి రోజుకు రూ. 50 నుంచి రూ. 120 వసూలు చేస్తున్నాయి. మధ్యవర్తులు, దళారులకు డబ్బులిస్తూ ఆర్థికంగా చిరు వ్యాపారులు చితికిపోతున్నారు.

మామూళ్లు ఇస్తేనే గుర్తింపు కార్డు..

వైఎస్సార్‌సీపీ పాలనలో చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు సచివాలయ వ్యవస్థ ద్వారా ఉచితంగా అందజేసేవారు. కూటమి పాలనలో ఒక్కొక్కర దగ్గర నుంచి రూ.200 నుంచి 300 వరకూ వసూలు చేసిన తర్వాత గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. నగదు వసూలు చేయడం వల్ల చాలామంది గుర్తింపు కార్డులు తీసుకోవడం లేదు. దాంతో జోనల్ పరిధిలో నేటి వరకూ 200 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. మరో 800 మందికి రిజిస్ట్రేషన్ చేయవలసి ఉంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా వడ్డీ లేని రుణాలు..

వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా చిరువ్యాపారులకు వడ్డీ లేకుండా రూ.10 వేల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చారు. కూటమి ఏడాది పాలనలో నేటికి ఒక్క రూపాయి లోన్ ఇవ్వలేదు. ప్రైవేటు వ్యాపారుల వద్ద నగదు తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. గత పాలనలో చిరు వ్యాపారులకు రెడ్, గ్రీన్, ఎల్లో జోన్లుగా విభజించారు. కూటమి ప్రభుత్వంలో ఈ నిబంధనలు ఉల్లంఘించారు. ఎన్టీఆర్ బెల్లం మార్కెట్, డీసీఎంఎస్ రహదారి, శారదానది బ్రిడ్జి రహదారులను గతంలో చిరువ్యాపారులు చేసుకునేందుకు గుర్తించారు.

చిరు వ్యాపారుల సమస్యలివి..

- ప్రభుత్వ నిబంధనలు ప్రకారం చిరువ్యాపారులకు కమిటీని ఏర్పాటు చేయాలి. చిరువ్యాపారం చేసుకునే వ్యక్తి, ప్రభుత్వ అధికారులు మాత్రమే ఉండాలి. కానీ ఈ కమిటీలో రాజకీయ నాయకులు మాత్రమే ఉంటున్నారు. చిరువ్యాపారుల సమస్యలు గాలికి వదిలేస్తున్నారు.
- పట్టణ పరిధిలో ప్రభుత్వం ప్రత్యేక స్థలం చూపించకపోవడంతో మెయిన్ రోడ్డులో రహదారులపై వ్యాపారాలు సాగిస్తున్నారు.
- సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు చిరు వ్యాపారుల వద్ద ఆశీలు వసూలు చేయకూడదు. ఈ నిబంధనలను అతిక్రమించి పట్టణంలో నిత్యం ఆశీలు వసూలు చేస్తున్నారు. వసూలు చేసిన నగదుకు ఎటువంటి రుసుము బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతున్నారు.
- రోడ్డు పక్కన స్థలం ఇచ్చేందుకు చిరు వ్యాపారులు రోజు కొంత నగదును వ్యాపారాన్ని బట్టి చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇది ఆర్థిక భారంగా మారింది.

గత పాలనలో ముద్రా లోన్ ఇచ్చారు



16 ఏళ్ల నుంచి పండ్ల వ్యాపారం చేస్తున్నాను. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రధాన మంత్రి ముద్రా యోజన కింద రూ.10 వేల రుణం తీసుకుని పూర్తిగా చెల్లించాను. ఈ వ్యాపారంపై ఇద్దరు పిల్లలను పోషించుకుని జీవిస్తున్నాను. తోపుడు బండి అద్దె రోజుకు రూ.100 చెల్లిస్తాను.

– పి.శ్రీను, మెయిన్‌రోడ్డు, అనకాపల్లి...

రహదారిపై కూరగాయల వ్యాపారం



20 ఏళ్ల మాకవరపాలెం నుంచి నిత్యం ఉదయం 9 గంటలకు కూరగాయలు తీసుకొచ్చి, ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో వ్యాపారం చేస్తున్నాను. ఎండ, వానకు తడిచి వ్యాపారం చేస్తున్నాను. గతంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో స్థలం కేటాయిస్తామని చెప్పారు. కరోనా సమయంలో రహదారులపై వ్యాపారం చేయవద్దని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌కు పంపించారు. రెండేళ్లుగా అక్కడే వ్యాపారం చేశాను. కరోనా తర్వాత మరలా రహదారిపై వ్యాపారం చేస్తున్నాం.

– ఎస్.నూకరత్నం, మాకవరపాలెం గ్రామం మాకవరపాలెం మండలం,

కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

ప్రభుత్వాలు మారుతున్నా చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు లేకుండా పోయాయి. వీరికి బీసీ కార్పొరేషన్ల ద్వారా లోన్లు మంజూరు చేయాలి. వ్యాపారం చేసుకోవడానికి సరైన స్థలాన్ని కేటాయించాలి. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలి. దాంతో పట్టణ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

– గంట్యాడ సత్తిబాబు, పట్టణ చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు, అనకాపల్లి

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. ఈ సమయంలో కశింకోట, బయ్యవరం, విసన్నపేట, రామన్నపాలెం, తేగాడ, వెదురుపర్తి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. ఆయా సమయాల్లో కన్నూరుపాలెం, తీడ, చెరకాం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట, ఆనందపురం, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

వారపు సంతకు ఎండ దెబ్బ


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత సూర్య తాపంతో వెలవెలబోయింది. గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధిక ఉష్ణోగ్రతతో సూర్యుడు తమ ప్రతాపాన్ని చూపాడు. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కొనుగోలుదారులు లేక సంత బోసిపోయింది. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో యధావిధిగా ప్రజలు వచ్చి కూరగాయలు, వంట సరుకులు, వగైరా కొనుగోలు చేయడంతో సంత కళకళలాడింది.

నేల కూలిన భారీ వృక్షం

- దెబ్బతిన్న కారు


కారుపై పడిపోయిన చెట్టును పరిశీలిస్తున్న పార్టీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు, విద్యుత్ ఉద్యోగులు

అనకాపల్లి: ఇటీవల వర్షాలకు స్థానిక 82వ వార్డు నర్సింగరావుపేట, జీవీ కోటేశ్వరరావు వీధిలో గురువారం ఉదయం భారీ వృక్షం నేల కూలడంతో కారు దెబ్బతింది. వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు, విద్యుత్ ఉద్యోగులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కారుపై పడిన చెట్టును క్రేన్ సహాయంతో తొలగించారు. తెగిపడిన విద్యుత్ వైర్లను ఆ శాఖ అధికారులు తమ సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. స్థానికులకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా పునరుద్ధరించారు. జీవీఎంపీ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించి కారుకు నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని యజమాని రఘువర్మకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోవాలి

అనకాపల్లి: ప్రభుత్వం ఈ నెలలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయనుందని ఏవో పి.రంగాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు జాబితా ప్రతి రైతు సేవా కేంద్రంలో నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. ఎవరైనా అర్హులై ఉండి జాబితాలో పేరు లేనిచో రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల్ని కలిసి భూమికి సంబంధించి పత్రాలను, ఆధార్ కార్డు ఇచ్చినట్లయితే నమోదు చేస్తారన్నారు. ఈ నెల 13వ తేదీ వరకూ అవకాశముందన్నారు. ప్రధానంగా కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, ఉద్యోగస్తులు, ఆదాయపు పన్ను చెల్లించే వ్యక్తులు, మాజీ ఉద్యోగస్తులు, ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు ఈ పథకంలో అనర్హులన్నారు.

చదువుతోపాటు సంస్కృతీ సంప్రదాయాలు

కశింకోట: విద్యార్థులకు చదువుతోపాటు దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి గురువులు బోధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. స్థానిక కోమటి వీధిలోని సత్య సాయి మందిరంలో గురువారం రాత్రి సత్యసాయి భజన మండళ్ల ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మాత్రమే కాకుండా భారతీయ ఇతిహాసాలు, స్వాతంత్ర్య పోరాటాలు, మహానుభావుల విజయ గాథలు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సత్య సాయి భజన మండలి కన్వీనర్ ముక్కా అప్పలనాయుడు, బీజేపీ ప్రతినిధులు ఎం.ఎం.నాయుడు, వై.ఎ. రాజు, ప్రగఢ నూకరాజు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా కన్యకాపరమేశ్వరి


శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం

అనకాపల్లి: ఆషాఢ మాసం గురుపౌర్ణమి గురువారం సందర్భంగా కన్యకాపరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు మూల విరాట్‌కు వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరణ చేశారు. పలువురు భక్తులు దర్శించుకున్నారు.

రామ జన్మభూమి బాలరాముడు ఉత్సవ విగ్రహానికి పూజలు...


అయోధ్య బాలరాముడు ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్న భక్తులు

రామ జన్మభూమి అయోధ్యలో బాల రాముడు ఉత్సవ విగ్రహం, పాదుకలు అయోధ్య లడ్డూ గురువారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకుంది. భక్తులు బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాలరామని విగ్రహం దాత చల్ల శ్రీనివాసశాస్త్రి అయోధ్యలో తెలుగువారి కోసం ఉచిత అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు

నూతన పాలక వర్గానికి అభినందన


బాబూరావును అభినందిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి

కశింకోట: నూతలగుంటపాలెం పాల సంఘం నూతన పాలక వర్గాన్ని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు గౌతు బాబూరావును గురువారం యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పీలా రమాకుమారితో కలిసి దుశ్శాలువా కప్పి అభినందించారు. పాలక వర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ ఇ. శ్రీనివాస్, సూపర్ వైజర్ కాయల సత్యనారాయణ, సోమవరం, జి. భీమవరం పాల సంఘాల అధ్యక్షులు గూడుపు ప్రకాష్, తురకలపూడి రాజుబాబు, పేయిడ్ కార్యదర్శి జెర్రిపోతుల నూకినాయుడు, పీలా కిరణ్ ఈశ్వరరావు, కోన శేఖర్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత స్థానం


కశింకోటలోని బాలికోన్నత పాఠశాలలో తల్లులకు వందనం చేసి ఆశీర్వాదం తీసుకుంటున్న బాలికలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


కూండ్రం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి


రాష్ట్ర, జిల్లా స్థాయిలో విద్యార్థులు వివిధ ఆటల పోటీల్లో సాధించిన విజయాలపై ప్రదర్శన

అనకాపల్లి టౌన్: ప్రతీ మనిషిని చదువే ఉన్నత స్థానాలకు చేరుస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. పట్టణం, మండలంలోని పలు పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు గురువారం అట్టహాసంగా జరిగాయి. మామిడిపాలెం పాఠశాలలో కార్యక్రమానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, ఎంఈవో కోటేశ్వరావు, డీఎస్పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు. పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమలో కూటమి నాయకులు పాల్గొన్నారు. కూండ్రం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవి పాల్గొని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం డబ్బులను విద్యార్థుల చదువుకే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలతో కూడిన ఉచిత విద్యనందిస్తున్నాయని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బీ కాంతారావు తెలిపారు. స్థానిక టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. తాను ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్నానన్నారు. ఇప్పుడు ప్రభుత్వం తనకు నెలకు రూ.3 లక్షల జీతం ఇస్తుందన్నారు. ప్రభుత్వం పథకాలను వినియోగించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కశింకోట: విద్యార్థులు బాగా చదివి భావి భారత పౌరులుగా ఎదగడానికి కృషి చేయాలని ఎస్ఐ కె. లక్ష్మణరావు కోరారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ కమిటీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లులకు మ్యూజికల్ చైర్ పోటీ, తండ్రులకు తాడు లాగుట ఆట నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, పీడీలు వి. ప్రభాకరరావు, పి. కమల, ఇన్‌చార్జి ఎన్‌వీజే ప్రసాద్, పేరంట్స్ కమిటీ అధ్యక్షురాలు నక్కా నాగమణి, ఉపాధ్యక్షుడు బర్ల దుర్గ అప్పారావు పాల్గొన్నారు. తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమం జరిపారు. హెచ్ఎం గాడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, పేరంట్స్ కమిటీ అధ్యక్షుడు మునభర్తి రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోటలోని బాలికల పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి..

కశింకోటలోని బాలికల పాఠశాలను జూనియర్ కళాశాల స్థాయికి పెంచడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. గురువారం నిర్వహించిన మెగా ఆత్మీయ సమావేశంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చారు. జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల అనకాపల్లి, యలమంచిలి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవలసి వస్తోందని, కొందరు మధ్యలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారని వాపోయారు. ఇక్కడి సమగ్ర బాలికల వసతి గృహంలో సీట్ల సంఖ్యను 450కి పెంచాలన్నారు. భోజన శాల లేక తరగతి గదుల వరండాల్లో భోజనం చేయాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశానికి గ్రీటింగ్ కార్డులు తయారు చేసి విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఆహ్వానించారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంఈవో కేఎస్ఎన్ మూర్తి, ఇన్‌చార్జి హెచ్ఎం శశికళ, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు దాడి కృష్ణ, బొడ్డేడ సత్యనారాయణ, వేగి దొరబాబు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- భారీ అన్న సమారాధనలు


తేగాడలో దత్తాత్రేయునికి పూలమాలలతో అలంకరణ


సాయిబాబాను దర్శించుకున్న జానకీ రామరాజు, జాజుల రమేష్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయి బాబా మందిరాల్లో పూజలు, భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేల్పులవీధిలోని సాయిబాబాను వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యకర్త సత్తిబాబు పాల్గొన్నారు.

కశింకోట: తేగాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో వ్యాస పూర్ణిమ ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.